# సీనియర్ సిటిజన్లకు గౌరవం కల్పించడమే లక్ష్యం

## వృద్ధుల రక్షణ గోల్డెన్ కేర్‌ను ప్రారంభించిన రాచకొండ సీపీ, సీపీ సుధీర్ బాబు





వృద్ధుల రక్షణ గోల్డెన్ కేర్‌ను ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాచకొండ సీపీ, సీపీ సుధీర్ బాబు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 25 (ఆంధ్రప్రభ) : రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీనియర్ సిటిజన్లకు రక్షణ కల్పిస్తూ, వారిని గౌరవించాలనే లక్ష్యంతో రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి గురువారం గోల్డెన్ కేర్-మనకోసం శ్రమించిన వారికి మన సంరక్షణ అనే వినూత్న కార్యక్రమాన్ని సీపీ సుధీర్ బాబు ప్రారంభించారు. వృద్ధుల కోసం పోలీసులు తరచుగా వారి నివాసాలకు వెళ్లి పర్యటించడం, వారికి నైతిక సహకారం అందించడంతోపాటు సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం, అత్యవసర సహాయం కోసం ఎస్ఓఎస్ సెటప్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. వైద్యం, అత్యవసర సహాయం కోసం ఆసుపత్రులతో అనుసంధానం చేస్తారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. ఈసందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ.. మన వృద్ధులు సమాజానికి నిజమైన మూలస్తంభాలు, జ్ఞాననిధులు. గోల్డెన్ కేర్ ద్వారా భద్రతతో పాటు వారిని ఆప్యాయంగా చూసుకోవటం గౌరవం, ఆత్మీయతను అందిస్తున్నామని, రాచకొండ పోలీసులు ఎల్లప్పుడూ మీ కుటుంబ సభ్యుల్లా ఉంటారన్నారు.

ఈ సందర్భంగా హాజరైన సీనియర్ సిటిజన్స్‌కు కిట్స్ పంపిణీ చేశారు. వృద్ధులు ఆర్థిక మోసాల నివేదనలో, శారీరక లేదా మానసిక వేధింపుల కేసుల దర్యాప్తులో, నిర్లక్ష్యం విడిచిపెట్టే సంఘటనల పరిష్కారంలో, కోల్పోయిన వస్తువులు లేదా తప్పిపోయిన వ్యక్తులను కనుగొనడంలో కూడా రాచకొండ పోలీసులు సహాయపడుతారని తెలిపారు. సెక్షన్ 144 ప్రకారం వృద్ధులను పోషించకుండా నిర్లక్ష్యం చేసినవారిపై చర్యలు తీసుకోవడం, మెయింటినెన్స్ యాక్ట్ సెక్షను 4, 5 వృద్ధులు తమ పిల్లల నుండి ఆర్థిక సహాయం పొందేలా చట్టపరమైన అంశాలపై కూడా వారికి అవగాహన కల్పించనున్నామన్నారు.

వృద్ధులు సహాయం కోసం సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ - 14567 లేదా రాచకొండ వాట్సాప్ నంబర్ - 8712662111 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమానికి మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, ఆర్కేఎస్సీ ట్రాఫిక్ మార్షల్స్ హాజరై మద్దతు తెలిపారు.

# గోల్డెన్ కేర్‌తో వృద్ధులకు భరోసా

**సీనియర్ సిటిజన్స్‌ను వేధిస్తే కఠిన చర్యలు**

**రాచకొండ సీపీ సుధీర్‌బాబు**

**కమిషనరేట్ పరిధిలో వృద్ధుల రక్షణ కోసం కొత్త కార్యక్రమం**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): వృద్ధులను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. వృద్ధుల సంక్షేమానికి రాచకొండ కమిషనరేట్‌లో రాచకొండ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి 'గోల్డెన్ కేర్-మన కోసం శ్రమించిన వారికి మన సంరక్షణ' అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి నిజమైన మూల స్తంభాలు, జ్ఞాన నిధులని గోల్డెన్ కేర్ ద్వారా భద్రత మాత్రమే కాదు, ఆప్యాయత, గౌరవం, ఆత్మీయతను అందిస్తున్నామన్నారు. రాచకొండ పోలీసులు ఎల్లప్పుడు మీ కుటుంబ సభ్యుల్లా ఉంటారని అన్నారు. వృద్ధుల సహాయం కోసం సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్ 14567/రాచకొండ పోలీస్ వాట్సాప్ నంబర్ 87126 6211ను సంప్రదించాలని సూచించారు. వృద్ధులు ఆర్థిక మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, శారీరక, మానసిక వేధింపులకు సంబంధించి కఠినంగా వ్యవహరించడం, ఎక్కడైనా వృద్ధులు పోగొట్టుకున్న వస్తువులను గుర్తించి వారికి అందజేయడంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వృద్ధులను ఇబ్బంది పెట్టే పిల్లలు, పోషించకుండా నిర్లక్ష్యంగా వహించిన వారిపై బీఎన్ఎస్ఎస్ 144 సెక్షన్ మేరకు చర్యలుంటాయని హెచ్చరించారు. కన్న తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ ఆప్యాయంగా చూసుకోవాలని వారికి కావాల్సిన ఆర్థిక సహాయం అందించాలని లేదంటే వృద్ధులు చట్టపరమైన రక్షణను కోరవచ్చని సూచించారు. గోల్డెన్ కేర్ ద్వారా వృద్ధుల సంక్షేమం, వైద్య, ఆరోగ్య, బీమా, అత్యవసర సహాయంలో పోలీసులు ఉంటారని తెలిపారు. కమిషనరేట్‌లోని 47 పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని వెల్లడించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో 70 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్లను గుర్తించి డాటా రూపొందిస్తున్నామన్నారు. మొదటి విడతలో 470 మందిని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులతో కలిసి గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ అధైర్యపడొద్దని పోలీసులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన వృద్ధులకు సీపీ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ఆకాంక్ష్ యాదవ్, మనోహర్, ప్రవీణ్‌కుమార్, అరవింద్‌బాబు, సునీతారెడ్డి, ఇందిర, ఉషా విశ్వనాథ్, నాగలక్ష్మి, రమణారెడ్డిలతో పాటు సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వృద్ధులకు కిట్లు అందజేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

# మీ భద్రతే మా ధ్యేయం...

- మీ కష్టాలను మాకు చెప్పండి.. మేమున్నాం...
- సీనియర్ సిటిజన్ల కోసం రాచకొండలో 'గోల్డెన్' కేర్ ప్రారంభం...
- 70 ఏండ్లు దాటిన వృద్ధులకు పోలీసుల అండదండలు
- ప్రతి వారం వారి ఇంటికి వెళ్లి ఆరా
- ప్రత్యేక కార్యాక్రమానికి సీపీ శ్రీకారం



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

చిన్నప్పటి నుంచి ఆల్లారుముద్దుగా పెంచిన పిల్లలు దూరం కావడం, కొందరికి ఉన్నా పిల్లల ప్రేమకు నోచుకోకపోవడం, వృద్ధాప్యంలో ఉన్న వారిని కొంతమంది పిల్లలు పట్టించుకోక పోవడం, లేదా కోడళ్ల వేధించడం, దూరంగా పెట్టడం, మరికొన్ని సందర్భాలల్లో వృద్ధులు ఒంటరిగా ఉంటున్నారు.. వారికి వచ్చిన సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో, ఎలా ఛేదించాలో అనే ఆందోళనకు గురవుతారు... ఇలాంటి వారికి భరోసా, భద్రత ఇవ్వాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రత్యేకంగా ఆలోచించారు. సీనియర్ సిటిజన్స్‌కు ఏదైనా చేయాలనే ఆలోచనతో 'గోల్డెన్ కేర్' ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మీరు చేసిన సేవతో సమాజాభివృద్ధి జరిగిందని ఇప్పుడు మీకు ఆదరణ అవసరం ఉందని వృద్ధులతో సీపీ మాట్లాడారు. మీ రక్షణ కోసం పోలీసులు అందుబాటులో ఉంటారని, ఎవరూ తోడులేరనే నిస్సాహాయస్థితిలో ఉన్నాం, ఈ వయస్సులో మేమేమి చేయలేకపోతున్నాం అనుకోవద్దు మీరు అనుకున్నది సాధించడం మీకు మేమున్నాం అంటూ సీనపీ వారిలో ధైర్యాన్ని నింపారు.

గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో సీనియర్ సిటిజన్స్ భద్రతకు సంబంధించి రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'గోల్డెన్ కేర్' కార్యక్రమాన్ని సీపీ సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బీఎన్ఎస్ 144 సెక్షన్ ప్రకారం సీనియర్ సిటిజన్లను సరిగ్గా చూసుకోకపోయినా, భోజనం పెట్టకపోయినా, వారిని హింసించినా చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు కమిషనరేట్ పరిధిలోని 47 పోలీసు స్టేషన్‌లలో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని తెలిపారు.

**47 పోలీస్‌స్టేషన్లలో 470 సీనియర్ సిటిజన్‌ల గుర్తింపు**

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 47 పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో 70 సంవత్సరాలు దాటిన 10 మంది సీనియర్ సిటిజన్ లను గుర్తించి ఒక డేటాను తయారు చేస్తామని, సీనియర్ సిటిజన్‌ల చెంతకు పోలీసు స్టేషన్ ఇన్ స్పెక్టర్, ఎస్ఐ, డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలు వారికి అనుగుణంగా ఉన్న సమయంలో వచ్చి పలకరిస్తారని భరోసా ఇచ్చారు. మీకు అవసరమయ్యే పోలీసు సేవలను అందిస్తారని, మీరు గురవుతున్న సమస్యకు చట్టపరంగా సహాయం చేస్తారని వివరించారు. ఇలా మొదటి విడతలో మొత్తం 470 మందిని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులతో కలిసి గుర్తించి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీపీ వివరించారు.

**అధైర్యపడొద్దు...మేమున్నాం...**

సీనియర్ సిటిజన్‌లు అధైర్యపడొద్దని, పోలీసులను మీ మిత్రులుగా అనుకోండని, మీ కష్టసుఖాలను మాకు చెప్పండని, మీకు అండగా ఉంటారని వృద్ధులకు సీపీ హామి ఇచ్చారు. ఒంటరిగా ఉన్నారనే భావనను తీసేయాలన్నారు. పోలీసులు , రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు మీ ఇంటికి వచ్చి సైబర్ నేరాలు, ఇతర నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఎలా పోలీసులను సంప్రదించాలి వంటి విషయాల పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మీకు వైద్య సమస్యలు, వైద్య సేవలు అవసర మున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి విషయాల పై మీకు సూచనలు ఇస్తారన్నారు. ఉద్యోగ రీత్యా పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉన్నా పిల్లలు ఉండి మిమ్మల్ని సరిగా చూడకపోయినా మీకు చట్టపరంగా అందాల్సిన సేవలను పోలీసులు అందిస్తారన్నారు.

**ఇప్పుడు మిమ్మల్ని ఎవరు చూస్తలేరు...**

చిన్నప్పటి నుంచి అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలు ఇప్పుడు చూడడం లేదని, కనీసం తమ కొడుకులు తమకు గంజి పోస్తలేరని, ఎంతో .కష్టపడి పెంచి ప్రయోజకులను చేస్తే ఇప్పుడు ఎవరూ చూస్తలేరంటూ కార్యక్రమానికి హాజరైన ఓ తల్లి పోలీసుల ముందు బోరుమంది. న్యాయపరంగా మీకు దక్కాల్సిన హక్కులను కలిగేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు భరోసానిచ్చారు.

**మాకు ధైర్యం వచ్చింది...**

రాచకొండ పోలీసులు గోల్డెన్ కేర్ కార్యక్రమంలో భాగంగా వారు తమకు తోడుగా ఉంటారని భరోసా కల్పించడంతో తమకు ధైర్యం వచ్చిందని ఓ సీనియర్ సిటిజన్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ పిల్లలు దూరంగా ఉన్నా రాచకొండ పోలసులున్నారనే భరోసా వచ్చిందని ఆయన సీపీతో సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం సీపీ నేరేడ్ మెట్‌లోని ఓ సీనియర్ సిటిజన్ ఇంటికి వెళ్ళి వారితో మాట్లాడారు. మీకేమైనా సమస్యలు ఉన్నాయా అంటూ పలకరించారు. సీనియర్ సిటిజన్‌లు ఎవరైనా పోలీసు సేవల కోసం హెల్ప్ లైన్ నెంబరు 14567 లేదా రాచకొండ వాట్సాప్ నెంబరు 8712662111కు సంప్రదించొచ్చని పోలీసులు తెలిపారు.



## మీ రక్షణ..

# మా బాధ్యత

### సీనియర్ సిటిజెన్స్ కోసం 'గోల్డెన్ కేర్' ప్రోగ్రాం

- తల్లిదండ్రులను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు భరోసా

**దిశ, సిటీబ్యూరో :** చట్టపరంగా, వృత్తిపరంగా సీనియర్ సిటిజెన్స్‌కు పోలీసు సేవలను సమర్థవంతంగా అందిస్తామని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు భరోసా ఇచ్చారు. ఇవాళ హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని సీపీ ఆఫీస్‌లో 70 ఏళ్లకు పైబడి తల్లిదండ్రుల భద్రతకు సంబంధించి రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన గోల్డెన్ కేర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బీఎన్ఎస్ 144 సెక్షన్ ప్రకారం సీనియర్ సిటిజెన్లను సరిగా చూసుకోకపోయినా, భోజనం పెట్టకపోయినా, వారిని హింసించినా చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. సీనియర్ సిటిజన్లు ఆందోళన చెందొద్దని, సంతోషంగా ఉండాలని కోరారు. ఈ గోల్డెన్ కేర్ కార్యక్రమంలో భాగంగా పోలీసు కమిషనరేట్ పరిధిలోని 47 పోలీస్‌స్టేషన్‌లలో వారి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. గుర్తించిన సీనియర్ సిటిజన్ల చెంతకు ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్, డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలు వారికి అనుకూల సమయంలో వారి వద్దకే వచ్చి పలకరిస్తారని తెలిపారు. ఉద్యోగరీత్యా పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉన్నా, పిల్లలు ఉండి మిమ్మల్ని సరిగా చూడకపోయినా చట్టపరంగా అందాల్సిన సేవలను పోలీసులు అందిస్తారని హామీ ఇచ్చారు. పోలీసు సేవల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 14567 లేదా రాచకొండ వాట్సాప్ నెంబరు 8712662111కు ఫోన్ చేయొచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, సునీతారెడ్డి, అక్షాంక్ష యాదవ్, ఇందిరా, ఉషా విశ్వనాథ్, నాగలక్ష్మి, అరవింద్‌బాబు, రమణారెడ్డి, మనోహర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి గోల్డెన్ కేర్

## రాచకొండ పరిధిలో 470 మంది ఎంపిక

ఈనాడు- హైదరాబాద్: నిస్సహాయస్థితిలో.. ఒంటరిగా ఉండే వయోవృద్ధులకు కనీస భద్రత కల్పించేందుకే 'గోల్డెన్ కేర్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. దీనివల్ల వృద్ధులకు నైతిక మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులను మిత్రులుగా భావించి.. కష్ట సుఖాలను చెప్పాలని సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో గోల్డెన్ కేర్(సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్) కార్యక్రమాన్ని సుధీర్‌బాబు గురువారం ప్రారంభించారు. వృద్ధులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పిల్లలు, సమాజం కోసం ఎంతో సేవ చేసిన వృద్ధులకు పోలీసులు ఇచ్చే గౌరవమే ఈ కార్యక్రమం.



**జేజేనగర్‌లోని వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న కమిషనర్ సుధీర్‌బాబు**

ఇందులో భాగంగా ప్రతీ ఠాణా పరిధిలో 70 ఏళ్లు దాటిన.. పిల్లలకు దూరంగా లేదా నిరాదరణకు గురై ఒంటరిగా ఉండే 10 మందిని గుర్తించాం. మొత్తం కమిషనరేట్ పరిధిలో 470 మంది ఉన్నారు. వీరిని కనీసం వారానికోసారి స్థానిక పోలీసు సిబ్బంది వెళ్లి కలిసి ఏవైనా సమస్యలున్నాయో తెలుసుకుంటారు. సైబర్ నేరాలు, అనారోగ్య సమస్యలపై ఎవరిని సంప్రదించాలి..? రోడ్డు ఎలా దాటాలి..? తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు" అని కమిషనర్ పేర్కొన్నారు. అనంతరం నేరేడ్‌మెట్‌లోని జేజేనగర్‌లోని వృద్ధ దంపతుల నివాసాన్ని కమిషనర్ సందర్శించి బహుమతి అందించి యోగ క్షేమాలను ఆరా తీశారు. డీసీపీలు పద్మజారెడ్డి, ప్రవీణ్‌కుమార్, అక్షాంశ్ యాదవ్, సునీతారెడ్డి, అరవింద్‌బాబు, ఉషారాణి, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శివ కారడి పాల్గొన్నారు.

# రాచకొండ పోలీస్ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభం



**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, సెప్టెంబర్ 25 (ప్రభాతవార్త):** వృద్ధులు ఎవ్వరూ ఒంటరి కాదు .. మీకు మేమున్నాం. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను ఆదుకోవడమే నిజమైన సేవ" అని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ పేర్కొన్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన గోల్డెన్ కేర్ (సీనియర్ సిటిజెన్ కేర్ అండ్ కంసర్న్) కార్యక్రమాన్ని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నేరేడ్మెట్‌లోని రాచకొండ సిటీ ఆఫీస్‌లో సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, వారిని నిర్లక్ష్యం చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 47 పోలీస్ స్టేషన్లలో ప్రతి స్టేషన్ పరిధిలో 10మంది చొప్పున 70 ఏళ్ల పైబడిన వృద్ధులను ఎంపిక చేస్తున్నామని, మొత్తం 470 మంది వృద్ధులను ప్రత్యేక పర్యవేక్షణలోకి తీసుకున్నామని తెలిపారు. వారిని ప్రతి వారం పలకరిస్తూ, వారి సమస్యలను విని, అవసరమైన సహాయాన్ని అందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులకు మానసిక ధైర్యం, భద్రతా భరోసా కల్పించడంతో పాటు నేరాల బారిన పడకుండా ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవడంపై వారికి సూచనలు చేస్తామని, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి మార్గదర్శనం చేసి త్వరలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు కూడా నిర్వహిస్తామని ప్రకటించారు."మీరు ఏ సమస్యలు ఎదుర్కొన్నా మాకు చెప్పండి. పండుగల సమయంలో మీకు మేమే ముందుగా పలకరిస్తాం. మీరు ఎప్పుడూ ఒంటరిగా లేరు. పోలీసులను మిత్రులుగా భావించండి" అని సీపీ వృద్ధులకు ధైర్యం చెప్పారు. దేవుడే ఈ సేవ చేసేందుకు అవకాశం ఇచ్చాడని భావిస్తున్నామని, రాష్ట్రం, దేశమంతా ఇలాంటి వ్యవస్థ ఏర్పడాలని ఆకాంక్షించారు. మన మందరం ఒకరోజు వృద్ధులం కావాల్సిందే కాబట్టి వారిని చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరింత విస్తరించి అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది" అని సుధీర్ బాబు స్పష్టం చేశారు.

## పేరెంట్స్‌ను పోషించకపోతే..

# కేసులు పెట్టి లోపలేస్తాం

- వేధిస్తే చట్టప్రకారం యాక్షన్ తీసుకుంటాం: సీపీ సుధీర్‌బాబు



**హైదరాబాద్‌సిటీ, వెలుగు:** పిల్లలు తమ తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని లేకపోతే కేసులు పెట్టి లోపలేస్తామని రాచకొండ సీపీ సుధీర్ బాబు హెచ్చరించారు. పేరెంట్స్‌ను వేధిస్తే చట్టప్రకారం యాక్షన్ తీసుకుంటామని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం 'గోల్డెన్ కేర్' ప్రోగ్రామ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వృద్ధులు ఆర్థికపరమైన మోసాలకు గురికాకుండా చూస్తాం. ఒకవేళ మోసపోతే పోలీసులను సంప్రదించేలా అవగాహన కల్పిస్తాం. కొడుకులు, కూతుళ్లు తమ పేరెంట్స్‌ను సరిగ్గా చూసుకోవాలి. శారీరక, మానసిక వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం వాళ్లు శిక్షార్హులు అవుతారు. రాచకొండ కమిషనరేట్‌లోని 47 పోలీస్‌స్టేషన్ల పరిధిలోంచి 470 మంది వృద్ధులను సెలెక్ట్ చేస్తున్నాం. ప్రతి వారం వారి బాగోగులు చూసుకుంటాం. ఏదైనా సమస్యలుంటే అండగా ఉంటాం" అని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# మీకు మేమున్నాం

## ❖ పోలీసులను మిత్రులుగా అనుకోండి; మీ కష్టసుఖాలను మాకు చెప్పండి: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు




**దశ, హైదరాబాద్:** వృద్ధుల కోసం 'గోల్డెన్ కేర్' (సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కంసర్న్) ప్రత్యేక కార్యక్రమాన్ని రాచకొండ సిటీ ఆఫీస్ నేరేడ్మెట్ లో రాచకొండ సిపి సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. వృద్ధుల పట్ల ప్రతి వ్యక్తికి తన బాధ్యతను గుర్తించాలి. చట్టంలో కూడా అలాని ఉంది. తల్లిదండ్రులకు సేవ చేయాలి. లేదంటే ఆ కొడుకులు శిక్షార్హులు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మేము వృద్ధుల కోసం గోల్డెన్ కేర్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో 70 ఏళ్ల పైగా వృద్ధుల అండ కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. 47 పోలీస్ స్టేషన్ పరిధిలోని 470 మంది వృద్ధులను సెలెక్ట్ చేస్తున్నాం. ప్రతి వారం వారి బాగోగులు చూసుకుంటాం.. ఏదైనా సమస్యలు ఉంటే మేము అండగా ఉన్నాం అని తెలియజేస్తాం. ఈ కార్యక్రమం వల్ల మోరల్ సపోర్ట్ తో పాటు.. నేరాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తామని అన్నారు. రాష్ట్రం.. దేశం అంతా ఇలాంటి వ్యవస్థ రావాలి. మనమందరం వృద్ధులం కావాల్సిందే.. అందుకే ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలి. భవిష్యత్తులో ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శం కావాలి. వృద్ధులు ఈ మంచి అవకాశాన్ని వినియోగించుకోండి. ఇది ఎప్పటికి కొనసాగుతుంది. భవిష్యత్తులో ఇంకా అనేక మంది వృద్ధులకు ఈ తరహా సేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి డీసీపీ మల్కాజిగిరి శ్రీమతి పద్మజ, ఐపీఎస్, ఎల్బీ నగర్ డీసీపీ శ్రీ ప్రవీణ్ కుమార్, భువనగిరి డీసీపీ, ఆకాంక్ష్ యాదవ్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా రాణి, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డీసీపీ రమణ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శివ కారడి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, సూర్యనారాయణ తో పాటు సీనియర్ అధికారులు, గౌరవనీయ అతిథులు, ట్రాఫిక్ మార్షల్స్ హాజరై తమ మద్దతు తెలిపారు.